నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 కరీంనగర్, సోమవారం 8 ఏప్రిల్ 2024 JAGTIAL



# ఉపాధ్యాయులపై ఉక్కుపాదం?

- పదో తరగతి మూల్యాంకనానికి గైర్హాజరుపై కలెక్టర్ సీరియస్
- డుమ్మాకొట్టిన 80 మందిపై చర్యలకు ఉపక్రమణ
- విద్యాశాఖ నుంచి రిలీవ్ ఉత్తర్వులు ఇచ్చేదాకా స్కూల్లో చేర్చుకోవద్దని హెచ్‌ఎంలకు ఆదేశాలు
- బేఖాతర్ చేస్తే మీ పైనా చర్యలు తీసుకుంటామని ప్రధానోపాధ్యాయులకు హెచ్చరిక
- కంగుతిన్న టీచర్లు.. సంఘాల చుట్టూ ప్రదక్షిణలు
- పైరవీ నడువదని, చర్యలు తప్పవంటున్న అధికారులు

**పదో తరగతి మూల్యాంకనానికి వివిధ కారణాలు చూపుతూ గైర్హాజరైన ఉపాధ్యాయులపై విద్యాశాఖ ఉక్కుపాదం మోపుతున్నది. ఇప్పటికే కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలతో 62 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా, తాజాగా మరికొందరిపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. అటు క్యాంపునకు, ఇటు స్కూల్‌కు రాకుండా డుమ్మా కొడుతున్న 80 మందిపై కొరడా ఝుళిపించింది. రిలీవ్ ఆర్డర్ ఇచ్చే దాకా వారిని పాఠశాల విధుల్లో చేర్చుకోవద్దని ఆయా స్కూల్ హెచ్‌ఎంలకు డీఈవో కార్యాలయం ఆదేశాలు జారీ చేయడమే కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే మీపైనా చర్యలు తప్పవని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నది. దీంతో కంగుతిన్న సదరు టీచర్లు సంఘాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పైరవీలు చేస్తున్నట్టు తెలుస్తుండగా, విద్యాశాఖ అధికారులు నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని చర్యలు తప్పవని స్పష్టం చేస్తుండగా, సదరు టీచర్లు కలవరపడుతున్నారు.**

కరీంనగర్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పదోతరగతి మూల్యాంకనం విషయం రోజుకో మలుపు తిరుగుతున్నది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీచర్లకు దెబ్బమీద దెబ్బ తగులుతున్నది. ఉపాధ్యాయుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సీరియస్‌గా తీసుకోవడంతో ఇటీవలే పలువురికి విద్యాశాఖ నుంచి షోకాజ్ నోటీసులు రాగా, తాజాగా మరి కొందరిని విధుల్లోకి తీసుకోవద్దంటూ హెచ్‌ఎంలకు ఆదేశాలు వెళ్లడం హాట్‌టాపిక్‌గా మారింది. కరీంనగర్ సెయింట్‌జాన్స్ పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 3న ప్రారంభమైంది. ఇది 11వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కేంద్రానికి వివిధ జిల్లాల నుంచి 2.20 లక్షల పైచిలుకు జవాబు పత్రాలు వచ్చాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన 1,087 మంది ఉపాధ్యాయులకు విద్యా శాఖ విధులు కేటాయించింది. విద్యాశాఖ ఆదేశాల మేరకు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు సదరు ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల నుంచి రిలీవ్ చేశారు. కాగా, అందులో చాలా మంది ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలు చూపుతూ మూల్యాంకన విధుల నుంచి తొలగించాలని అర్జీలు పెట్టుకున్నారు. సగానికి పైగా అంటే.. దాదాపు 600 మంది పంతుళ్లు తమకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ అర్జీలు పెట్టడంతో విద్యాశాఖ కంగుతిన్నది. ఇలా అయితే, మూల్యాంకనం ఎలా పూర్తి చేస్తామని భావించింది. అయితే, మెజార్టీ టీచర్లు అనారోగ్య కారణాలను చూపడంతో కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. నిగ్గు తేల్చేందుకు డీఈవోకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అర్జీలు పెట్టుకున్న వారికి మూల్యాంకన కేంద్రంలోనే మెడికల్ బోర్డు ద్వారా టెస్టులు నిర్వహించారు. ఇందులో అనారోగ్యం లేని వారిని విధుల్లో చేరాలని ఆదేశాలు ఇవ్వగా, నిర్లక్ష్యం చేసిన 62 మందికి ఇటీవలే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని 'పంతుళ్లపై చర్యలు' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' ఆదివారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.

## రిలీవ్ ఆర్డర్ ఇచ్చే వరకు చేర్చుకోవద్దు.

మూల్యాంకనం వివరాలపై కలెక్టర్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తూనే ఉన్నారు. ఉపాధ్యాయుల గైర్హాజరుపై జిల్లా విద్యాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లుగా అధికారుల ద్వారా తెలుస్తోంది. అయితే, ఈ వ్యవహారంలో తీగ లాగితే డొంకంతా కదులుతోంది. మూల్యాంకనం పేరుతో పాఠశాలల నుంచి రిలీవ్ అయిన సుమారు 80 మందికిపైగా ఉపాధ్యాయులు క్యాంపునకు హాజరు కావడంలేదని, వారికి మూల్యాంకనం విధుల నుంచి ఎటువంటి మినహాయింపూ లేదని విద్యాశాఖ గుర్తించింది. విద్యాశాఖ అధికారులు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో సీరియస్‌గా తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఆ మేరకు మూల్యాంకనం విధుల పేరుతో స్కూల్ నుంచి రిలీవ్ అయిన టీచర్లను తిరిగి డీఈవో కార్యాలయం నుంచి రిలీవ్ ఆర్డర్ ఇచ్చే దాకా పాఠశాలల్లో చేర్చుకోవద్దని ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సదరు హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, ఈ విషయం సీరియస్ అవుతుండడంతో సదరు ఉపాధ్యాయులంతా ఉపాధ్యాయ సంఘాలను ఆశ్రయిస్తూ, కాపాడాలని వేడుకుంటున్నట్లు తెలిసింది.

## సంఘాల జోక్యం తగదు

మూల్యాంకనం విధుల కోసం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయులు నడుచుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో మూల్యాంకనం పూర్తి చేసే ఆస్కారం ఉంటుంది. నిజంగానే మూల్యాంకనం చేయడానికి ఏమైనా ఇబ్బందులున్నా, అనారోగ్య కారణాలున్నా సదరు టీచర్లు అర్జీ పెట్టుకోవాలి. సదరు అర్జీని పరిశీలించి విధుల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం జిల్లా విద్యాధికారికి మాత్రమే ఉంటుంది. ఆయన సమ్మతిస్తేనే అధికారికంగా విధుల నుంచి మినహాయింపు లభించినట్లు అవుతుందని విద్యాశాఖ చెబుతోంది. కానీ, చాలామంది ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలు చూపుతూ అర్జీ పెట్టేసి చేతులు దులుపుకున్నారు. అది ఆమోదం పొందిందా? లేదా ? అన్న వివరాలు తెలుసుకోకుండానే విధులకు గైర్హాజరవుతున్నారు. సదరు టీచర్లకు ఒకటికి రెండు సార్లు అధికారుల నుంచి సమాచారం వెళ్లినా పెడచెవిన పెట్టారు. దీంతో విద్యాశాఖ మెడికల్ బోర్డు ద్వారా టెస్టులు చేయించడంతో సిక్ లేని వారు విధులకు హాజరుకాక తప్పలేదు. కాగా, మెడికల్ బోర్డు ద్వారా టెస్టులు నిర్వహించి ఉపాధ్యాయుల గౌరవాన్ని దెబ్బతీశారంటూ పలు ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేసేందుకు కరీంనగర్ డీఈవో జనార్ధన్‌రావుకు నోటీసు ఇవ్వగా, ఆయన ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఇదిలా ఉండగా ప్రస్తుతం విధుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న ఉపాధ్యాయుల విషయం సీరియస్ అవుతున్న నేపథ్యంలో సదరు ఉపాధ్యాయులు తిరిగి పలు సంఘాలను ఆశ్రయిస్తున్నారు. ఆ మేరకు డీఈవోపై సదరు సంఘాలు ఒత్తిడి తెస్తున్నాయి. అంతేకాదు కొన్ని సంఘాలు బెదిరింపులకు పాల్పడుతున్నాయి. అయితే, మూల్యాంకనం విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోకతప్పదని, ఈ విషయంలో సహకరించాల్సింది పోయి పైరవీలు చేయడం ఏంటంటూ సంఘాలను విద్యాశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాదు జరిగిన వ్యవహారం అంతా కలెక్టర్ దృష్టిలో ఉండడంతో విద్యాధికారులు వెనక్కి తిరిగి చూడకుండా.. చర్యలపైనే దృష్టిపెడుతున్న తీరు పలు సంఘాలకు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులకు మింగుడు పడడం లేదు. కాగా, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి విద్యాశాఖాధికారులు మూల్యాంకన విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న తీరు విద్యాశాఖవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయంపై కరీంనగర్ జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావుతో 'నమస్తే తెలంగాణ' మాట్లాడగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని, ఇందులో ఎవరికీ ఎటువంటి మినహాయింపూ లేదని స్పష్టం చేశారు.

# హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కారు

కలెక్టరేట్, ఏప్రిల్ 7 : అంగన్‌వాడీ టీచర్లు పోరాడి సాధించుకున్న హక్కులను కాంగ్రెస్ సర్కారు కాలరాస్తున్నదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు మంగ ఆరోపించారు. ఆదివారం నగరంలోని ముకరంపురలో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో యూనియన్ మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంగ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం సత్వరమే అమలు చేయకుండా, తమకు నష్టం కలిగించేలా జీవో నెంబర్ 1334ను తెచ్చిందని, దానిని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 24 రోజుల పాటు పోరాడి సాధించుకున్న పదవీ విరమణ ఫలాలను కాంగ్రెస్ సర్కారు కాలరాస్తోందని మండిపడ్డారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 65 ఏళ్లు నిండిన టీచర్లను, ఆయాలను ఎలాంటి సంకోచం లేకుండా ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకునే విధంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కింద రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష పంపిణీ చేయాలని కోరారు. అలాగే, టీచర్లకు ప్రస్తుత వేతనం సరిపోవడం లేదని, కనీస వేతనంగా రూ.26 వేలు ప్రకటించి, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పింఛన్ సౌకర్యం కల్పించి, ఆదుకోవాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కాదు..
# ప్రతీకార పాలన

- గ్యారెంటీల పార్టీ కాదు.. గారడీల పార్టీ
- కాంగ్రెస్ దోపిడీ పాలనను అంతమొందించేదాకా ఉద్యమిద్దాం
- ఈ ఎన్నికలు తెలంగాణ ప్రజలు, ద్రోహులకు మధ్య జరుగుతున్న పోరాటం
- విధ్వంసకారులు కావాలా..? అభివృద్ధి సాధకులా..?
- ఎవరు కావాలో మీరే నిర్ణయం తీసుకోండి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ స్థాయి యుద్ధభేరి సదస్సు




మాట్లాడుతున్న ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, వేదికపై కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకె, బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లాధ్యక్షుడు ఆగయ్య

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 7: ''రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది ప్రజా పాలన కాదు.. దోపిడీ, ప్రతీకార పాలన. కాంగ్రెస్ గ్యారంటీల పార్టీ కాదు.. దోపిడీల పార్టీ'' అని దానిని అంతమొందించేదాకా ఉద్యమిద్దామని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'ఈ పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ ప్రజలకు, ద్రోహులకు మధ్య సాగుతున్న పోరాటం. పదేళ్ల కేసీఆర్ అభివృద్ధి పాలనకు వంద రోజుల అబద్ధాల కాంగ్రెస్ పాలనకు మధ్య జరుగుతున్న యుద్ధం. గుండెల నిండా కరీంనగర్‌పై ప్రేమ ఉన్న వ్యక్తి వినోద్‌కుమార్‌కు గుట్కా ప్యాకెట్లకు మధ్య జరుగుతున్న పోరు' అని చెప్పారు. శవాలు, శివాలు అని మాట్లాడే విధ్వంసకారులను పార్లమెంట్‌కు పంపిస్తే రాజ్యాంగం భద్రంగా ఉంటుందా..? అని ప్రశ్నించిన ఆయన, మీకు విధ్వంసకారులు కావాలా..? అభివృద్ధి సాధకులా..? ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. నిత్యం ప్రజల అభ్యున్నతి కోసం, జిల్లా అభివృద్ధి కోసం పాటుపడే వారిని పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని దాసరి గార్డెన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్లమెంట్ స్థాయి యుద్ధభేరి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. పార్టీ కార్యకర్తల్లో ప్రస్తుతం ఉన్న కదన కుతూహలం మే 13 వరకూ కొనసాగాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కరీంనగర్ పోలీసులు మన కార్యకర్తలు, నాయకులపై ఎవరిపై పడితే వారిపై కేసులు పెడుతున్నారని, కానీ ఆ కేసులకు భయపడరని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై పుట్టిన మేధావి వినోద్‌కుమార్ అని, కరీంనగర్ ఎంపీగా మరోసారి గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని బీఆర్‌ఎస్ చెబుతుంటే, రేవంత్‌రెడ్డి మాత్రం వారి అడ్రస్సులు చెప్పండి. విచారణ చేసి ఎన్నికల తర్వాత ఆదుకుంటామని అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఎన్నికల ముందు హామీలిచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సాగుతున్న దోపిడీ పాలనపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అభివృద్ధి గురించి ఆలోచనలు చేసి ఆచరణలో పెట్టేవారిని ఎంపీగా చేద్దామా..? గుట్కాలు తింటూ, నైంటీ ఎంఎల్ తాగుతూ, బైక్‌లపై తిరిగేవారిని ఎంపీగా చేద్దామా..? ఆలోచించాలని సూచించారు.

## వినోద్‌కుమార్‌తోనే అభివృద్ధి



కరీంనగర్ నియోజకవర్గం, నగరంలో అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలి. కరీంనగర్‌కు అర్హత లేకున్నా స్మార్ట్‌సిటీ తీసుకువచ్చిన ఘనత వినోద్‌కుమార్‌కే దక్కుతుంది. అసాధ్యం అనుకున్న పనిని సుసాధ్యం చేసి చూపించిన వ్యక్తి. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుగా నిలవడం వల్లే నియోజకవర్గానికి నిధులు వచ్చాయి. కానీ ఐదేండ్లుగా అలాంటి ప్రశ్నించే గొంతు లేకపోవడం వల్లే నిధులు రావడం లేదు. వినోద్‌కుమార్ గెలుపు అనేది జిల్లాకు ఎంతో అవసరం.

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



హాజరైన నాయకులు, కార్యకర్తలు



## తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

- బీఆర్‌ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే వచ్చే ఐదేళ్లలో ప్రతి రోజూ 24 గంటలపాటు తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసమే పని చేస్తానని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. నిజాయితీగా పని చేసే పార్టీ ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమేనని చెప్పారు. అలాగే, ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని చెప్పి, సరఫరా చేశామని, 24 గంటల కరెంటిచ్చామని గుర్తు చేశారు. గోదావరి నుంచి వంద అంతస్తుల పైకి నీటి ఎత్తి పోసి కోటి ఎకరాలకు సాగు నీరందించామని తెలిపారు. గత ప్రభుత్వాలు దళితులకు కొద్దిపాటి సబ్సిడీతో రుణాలు ఇచ్చేవని, వాటి కోసం ప్రజలు చెప్పులరిగేలా తిరిగే పరిస్థితులు ఉండేవన్నారు. అలాంటివి రావద్దనే కేసీఆర్ పూర్తిస్థాయిలో మాఫీతో దళితబంధు పథకాన్ని తెచ్చారన్నారు. గతంలో తాను ఎంపీగా అర్హత లేకున్నా కూడా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకువచ్చి అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ గెలిస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు తోట ఆగయ్య, దాసరి ఉష, చల్ల హరిశంకర్, కంసాల శ్రీనివాస్, పొన్నం అనిల్, దూలం సంపత్, నాగరాజు పాల్గొన్నారు.

# మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

- కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి
- గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- ఎన్టీపీసీలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

జ్యోతినగర్, ఏప్రిల్ 7 : కార్యకర్తలు కష్టపడి పనిచేసి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. ఎన్టీపీసీలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల పార్టీ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలు, ప్రచార విధివిధానాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోని తప్పిదాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఎండగట్టాలన్నారు. వంద రోజుల పాలనలో 209 మంది రైతులు మరణించారని, కానీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక్క రైతు కూడా చనిపోలేదని దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయని రేవంత్ సర్కారుకు ఓట్లడిగే హక్కులేదని విమర్శించారు. ఢిల్లీలో తెలంగాణ గళం వినిపించాలంటే మన పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కోరారు. తెలంగాణ ఉన్నంతకాలం గులాబీ జెండా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ప్రజాసమస్యలపై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన తాను.. 30 ఏండ్లుగా ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్నానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పెద్దపల్లి, జగిత్యాల, భూపాలపల్లి జడ్పీ అధ్యక్షులు పుట్ట మధూకర్, దావ వసంత, జక్కు శ్రీహర్షిణి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు పాల్గొన్నారు.



హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

# న్యూట్రిషన్ కిట్లకు మంగళం

- పథకాన్ని పక్కనపెట్టేసిన కాంగ్రెస్ సర్కారు
- తల్లీబిడ్డల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా గతేడాది కేసీఆర్ పాలనలో శ్రీకారం
- పట్టించుకోని కొత్త ప్రభుత్వం
- రెండునెలలుగా పంపిణీ నిలిపివేత
- గర్భిణులకు అందని పౌష్టికాహారం

**కాబోయే తల్లుల ఆరోగ్యంపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. గర్భిణులకు అందించే పౌష్టికాహారానికి ఎగనామం పెట్టింది. జన్మనిచ్చే తల్లి, పుట్టబోయే బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ సర్కారు శ్రీకారం చుట్టిన న్యూట్రిషన్ కిట్ల పథకాన్ని అటకెక్కించింది. ప్రభుత్వం మారడంతోనే పాత స్కీంను పక్కన పెట్టేసి, రెండు నెలలుగా పంపిణీని నిలిపివేసింది. దీంతో ఆడబిడ్డలకు పోషకాహారం అందకుండా పోతుండగా, ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.**



పెద్దపల్లి, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): 'కాబోయే తల్లి ఆరోగ్యంగా ఉండాలి. కడుపులో బిడ్డ మంచిగా ఎదగాలి' అనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వం గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని భావించింది. ఆ మేరకు గతేడాది అక్టోబర్‌లో న్యూట్రిషన్ కిట్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పైసా ఖర్చులేకుండా ఉచితంగా అందజేసింది. కిలో ప్రొటీన్ పౌడర్, కిలో ఖర్జూర, మూడు ఐరన్ సిరప్స్, బెల్లం పల్లిపట్టీలు, ఇతర పదార్థాలతో కిట్‌లో ఉంచి నాలుగో నెలలో ఒకసారి, ఎనిమిదో నెలలో ఒకసారి పంపిణీ చేసింది. గత ప్రభుత్వం బృహత్తర లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినా, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు పంపిణీకి బ్రేక్ వేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పథకం దాదాపుగా నిలిచిపోయినట్లు తెలుస్తుండగా.. పెద్దపల్లి జిల్లాలోని 18 పీహెచ్‌సీలు, 6 యూపీహెచ్‌సీలు, మూడు సీఎఫ్ డబ్ల్యూసీ కేంద్రాల పరిధిలో మాత్రం మొత్తంగా ఆగిపోయింది. ఇక రెండు నెలలుగా పెద్దపల్లి జిల్లా దవాఖాన, మంథని సివిల్ దవాఖానకు రావడం లేదు. కేవలం రామగుండం జనరల్ దవాఖాన (గోదావరిఖని)లో మాత్రమే కిట్లు అందుబాటులో ఉన్నాయి. అవి కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసినవే. కాగా, జిల్లాలో పథకం ప్రారంభ సమయంలో జిల్లావ్యాప్తంగా 5,596 మంది గర్భిణులకు కిట్లు అందాయి. వాటి పరిధిలో 12 నుంచి 24 వారాల గర్భిణులకు మొదటి కిట్, 28వారాల నుంచి 34వారాల గర్భిణులకు రెండో కిట్ ఇచ్చారు. కాగా, అప్పుడు మొదటి విడత కిట్ తీసుకున్నవారు ప్రస్తుతం ఎనిమిదో నెలకు వచ్చారు. కిట్ల కోసం ఎదురుచూస్తున్నారు. పోషకాహారం అందక ఇబ్బంది పడుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలు, దవాఖానలకు వెళ్లి వైద్యాధికారులను అడుగుతున్నా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

## రాగానే అందిస్తాం



జన్మనిచ్చే తల్లి, పుట్టబోయే బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే న్యూట్రిషన్ కిట్ల పథకాన్ని ప్రారంభించాం. అయితే, రెండు నెలలుగా జిల్లాకు న్యూట్రిషన్ కిట్లు రావడం లేదు. త్వరలోనే వచ్చే అవకాశమున్నది. రాగానే జిల్లా వ్యాప్తంగా అందిస్తాం.

- డా. ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో (పెద్దపల్లి జిల్లా)

# తాగునీటి కోసం తండ్లాట



వీర్నపల్లి మండలం మద్దిమల్లలో తాగునీటి కోసం బిందెలతో వెళ్తున్న మహిళలు

కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసింది. పదేండ్లలో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలాచోట్ల నీటి కటకట మొదలైంది. వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో ప్రజలు తాగునీటి కోసం పొలాలు, బోరుబావుల వద్దకు బారులు తీరుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం పడిన కష్టాలు మళ్లీ కొద్దిరోజుల నుంచి మొదలయ్యాయని లొద్దితండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి ముందే నల్లానీళ్లు పట్టుకుని పరిస్థితి నుంచి పొలాల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి వచ్చిందని వారు వాపోతున్నారు.

- ఎల్లారెడ్డిపేట/ వీర్నపల్లి, ఏప్రిల్ 7



బోరుబావి వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు